పేదలకు ఇంటి స్థలాలను పంపిణీ చేయాలి

మండలం చింతపట్ల గ్రామంలో తహసీల్దార్ అయ్యప్పకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

యాచారం, జూన్ 6: మండలంలోని చింతపట్ల గ్రామంలో ఉన్న రెండెకరాల ప్రభుత్వ స్థలాన్ని ఇంటి స్థలం లేని పేదలకు వెంటనే పంపిణీ చేయాలని గ్రామస్తులు రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో తహసీల్దార్ అయ్యప్పకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలో ఇంటి స్థలం లేకపోవడంతోనే ఇటీవలే దొడ్డి అశోక్ అనే వ్యక్తి ఇందిరమ్మ ఇల్లు రాలేదని మనస్థాపానికి గురై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీపీఎం నాయకుడు జంగయ్య అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో దళితుల ఇంటి స్థలాల కోసం 20ఏళ్ల కింద ప్రభుత్వం కొనుగోలు చేసిన రెండెకరాల స్థలాన్ని నిరుపేదలకు వెంటనే పంపిణీ చేసి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేసే వరకు పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. మల్కిజ్‌గూడా గ్రామంలో భూ సమస్యల పరిష్కారం కోసం డిప్యూటీ తహసీల్దార్ కీర్తి సాగర్‌కు రైతులు దరఖాస్తులను అందజేశారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై పోలీసులతో సమావేశమైన ఆమనగల్లు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి స్వరూప

ఆమనగల్లు, జూన్ 6: ఈ నెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి స్వరూప అన్నారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణంలోని కోర్టు కార్యాలయంలో, జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై పోలీసులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కోర్టు కేసుల్లో రాజీయే రాజ మార్గమని, బాధితులు లోక్‌అదాలత్‌లో సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ నెల 14న ఆమనగల్లులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని, కేసుల నుంచి విముక్తి పొందాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీపీ కార్తిక్, ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల్ సీఐలు జానకిరామ్‌రెడ్డి, గంగాధర్, వేణుగోపాల్, ఎక్సైజ్ సీఐ బద్యా నాయక్, తలకొండపల్లి ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

షాద్‌నగర్‌టౌన్, జూన్ 6: ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ పోస్టర్‌ను శుక్రవారం డాక్టర్లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి రెడ్డి, ఖదీర్, నర్సింహులు, వైద్యులు షీలా, జయప్రకాశ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఫార్మాసిస్ట్‌లు బాబు, చిన్మయరంగా, వరలక్ష్మి, ఈశ్వరి, యోగా ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పంటల మార్పిడితోనే అధిక దిగుబడి

గ్రామాల్లో కొనసాగుతున్న 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం
వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చేవెళ్ల రూరల్ : ఖానాపూర్‌లో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

చేవెళ్ల రూరల్, జూన్ 6 : రైతులు పంటల మార్పిడితోనే నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త ఎం.ప్రమీల సూచించారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం చేవెళ్ల మున్సిపల్ పరిధి ఇబ్రహీంపల్లి, మండల పరిధి ఖానాపూర్ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విశ్వవిద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త ఎం.ప్రమీల, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రమ్య, కవితాకిరణ్, స్నేహలత మాట్లాడుతూ.. అధిక రసాయనాలు, ఎరువుల వాడకంతో నేల సహజ సారం కోల్పోతుందని అన్నారు. చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. పోషకాహార ప్రాముఖ్యత, ఆహారం ప్రాముఖ్యతపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శంకర్ లాల్, వ్యవసాయ విస్తరణాధికారి రమ్య, ప్రతిభ, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్, పీహెచ్‌డీ విద్యార్థులు రాజేశ్, గిరిబాబు, రైతులు మల్లారెడ్డి, సామ అంజిరెడ్డి, పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

షాబాద్, జూన్ 6: పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ వ్యవసాయ శాస్త్రవేత్తలు సతీశ్, శ్రీనివాస్‌రెడ్డి, శిరీష అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చందనవెల్లి, రేగడిదోస్వాడ గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త సతీశ్ మాట్లాడుతూ... రైతులు పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని చెప్పారు. ఆర్థిక శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పంట దిగుబడి మాత్రమే కాకుండా నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. శాస్త్రవేత్త శిరీష మాట్లాడుతూ రైతులు తమ సొంత విత్తనాలతోనే మూడు నుంచి నాలుగు సంవత్సరాలు విత్తనోత్పత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం, ఏఈవోలు రాజేశ్వరి, గీత, రీసెర్చ్ స్కాలర్స్ అవనీజ, మిలింద్, అంగన్‌వాడీ టీచర్ శ్రీలత, వ్యవసాయ పరిశోధన విద్యార్థి శ్రవణ్‌కుమార్, సహకార సంఘం వైస్ చైర్మన్ మల్లేశ్, స్వామి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం, జూన్ 6 : మండలం ఎలిమినేడు గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు ప్రకాశ్, పద్మజ మాట్లాడుతూ వర్షాకాలం పంటల సాగులో రైతులు భూసార పరీక్షలు నిర్వహించటంతో పాటు వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటల సాగు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మంగల్‌పల్లి సహకార సంఘం చైర్మన్ మహేందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ఏవో విద్యాదరి, ఏఈవో శ్రవణ్‌కుమార్, పశువైద్యాధికారి ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

మొయినాబాద్ : రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని వీరన్నగర్ గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు మాధవి, లీలారాణి, మండల వ్యవసాయ అధికారి అనురాధ, వ్యవసాయ విస్తరణ అధికారి కుమార్, మాజీ సర్పంచ్ మానయ్య, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

కడ్తాల్ : ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు అనిత, విద్యాసాగర్, శిరిషాదీప్తి, సుజాత, స్వప్నశ్రీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చరికొండ, సాలార్‌పూర్ గ్రామాల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు నిర్వహించిన, రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పంట సాగులో రసాయన ఎరువులను తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడాలని తెలిపారు. వర్మీ కంపోస్టు, పచ్చి రొట్ట పద్ధతులలో భూసారం పెరగడంతోపాటు దిగుబడులు రెట్టింపవుతాయని పేర్కొన్నారు. నీటి కొరత నివారణకు తుంపర, బిందు సేద్యంతో పంటలను సాగు చేయాలన్నారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు రసీదును తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీలత, ఏఈవోలు కశ్యప్, అనూష, రైతులు నాగభూషణం, మల్లయ్య, నర్సింహ, రవి పాల్గొన్నారు.

వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం అవసరం

నందిగామ : మండలంలోని వెంకమ్మగూడ గ్రామంలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నందిగామ మండల వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు వ్యవసాయంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో చేగూర్ పీఏసీఎస్ చైర్మన్ అశోక్, జయశంకర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బలరాం, శాస్త్రవేత్త సుకుమార్, ఏవో రామశివరపు, ఏఈవో రవి పాల్గొన్నారు.

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

యాచారం, జూన్6: మండలంలో కురిమిద్ద ప్రభుత్వ పాఠశాల నుంచి మేఘన, మనీష నేషనల్ మెరిట్ స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తు పాండురంగారెడ్డి శుక్రవారం తెలిపారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు నిర్వహించే ప్రతిభా పరీక్ష ద్వారా దీనిని ఎంపిక చేస్తారని ఆయన తెలిపారు. ఈ విద్యార్థులకు సంవత్సరానికి రూ.12,000 చొప్పున ఉపకార వేతనం 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు వారి బ్యాంకు ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం ద్వారా జమ చేస్తుందన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

కడ్తాల్, జూన్ 6: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాకే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం కడ్తాల్ మండలాధ్యక్షుడు వెంకటేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీసీల రిజర్వేషన్ పెంపు బిల్లుకు ఆమోదం తెలపని పక్షంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు. అదే విధంగా సమాచార కమిషనర్ల ఎంపికలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రేవంత్ సర్కార్ నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 42 శాతం కేటాయించాలని తెలిపారు. అదే విధంగా బీసీ సంఘాలు చేసిన పోరాటాలతోనే కేంద్ర ప్రభుత్వం సమగ్ర కుల గణన చేపడతామని ప్రకటించిందని పేర్కొన్నారు. బీసీలకు జానాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కడ్తాల్, జూన్ 6: మండల పరిధిలోని గాన్గుమార్లతండా పంచాయతీలోని కాన్గుబావితండాకు చెందిన నేనావత్ జగన్‌నాయక్ అనారోగ్యంతో బాధపడుతూ దవాఖానలో చికిత్స పొందాడు. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా బాధితుడికి మంజూరైన చెక్కును ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం అందజేశారు. అనంతరం కొండ్రిగానిబోడు తండాలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ, ఎమ్మెల్యేకు తండా నాయకుడు బిక్కునాయక్ వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, నాయకులు సురేందర్‌రెడ్డి, శంకర్, సుమన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఊరెళ్లలో బడిబాట పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో పురందాస్, ఉపాధ్యాయులు

యాచారం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బడిబాట గ్రామ సభలో మాట్లాడుతున్న నరసింహ

యాచారం, జూన్6: ప్రభుత్వ పాఠశాలల్లోనే విలువలతో కూడిన విద్య అందుతోందని యాచారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.నరసింహ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బడిబాటలో భాగంగా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ కోసం పాఠశాల ఆవరణలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

చేవెళ్ల రూరల్, జూన్ 6 : ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడానికి కృషి చేయాలని మండల విద్యాధికారి పురందాస్ సూచించారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ పరిధి ఊరెళ్లలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, శేఖర్, వెంకటేశ్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణ ప్రకాశ్‌రెడ్డి, రాఘవేందర్, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ

కొత్తూరు, జూన్ 6: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం ఏర్పడుతుందని బీఆర్ఎస్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ అన్నారు. కొత్తూరు మండలంలోని ఎస్‌బీపల్లిలో శ్రీకాంత్, శివ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్, నరసింహారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ అజయ్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాండు, కృష్ణయ్య, కృష్ణయ్య, నర్సింహులు, ఆంజనేయులు, తిరుపతి, లక్ష్మయ్య, కిడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల హామీని నెరవేర్చాలి

తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న టీయూఎఫ్ నాయకులు

పెద్దఅంబర్‌పేట, జూన్ 6: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని టీయూఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు మున్సిపాలిటీ పరిధి కుంట్లూరులో తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఉద్యమకారులకు 250 గజాల భూమిని కేటాయిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణు వర్ధన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి, మున్సిపాలిటీ టీయూఎఫ్ అధ్యక్షుడు రాములు, ముకేశ్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల అందజేత

కడ్తాల్, జూన్ 6: మండల పరిధిలోని న్యామంతపూర్ గ్రామానికి చెందిన బోదాసు మహేష్ గ్రామంలోని హనుమాన్ గుడిలో భద్రతా నిమిత్తం తన స్వంత డబ్బుతో రూ. 10 వేలతో సీసీ కెమెరాను కొనుగోలు చేసి పోలీస్ సిబ్బందికి అందజేశారు.

పకడ్బందీగా భూ రికార్డుల నిర్వహణ

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు
భూ సమస్యలపై దరఖాస్తుల వెల్లువ

చేవెళ్ల రూరల్ : ఇబ్రహీంపల్లిలో ప్రొసీడింగ్స్ అందజేస్తున్న చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య

నందిగామ, జూన్ 6: భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండలంలోని అప్పారెడ్డిగూడ గ్రామంలో నందిగామ తహసీల్దార్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూ భారతితో రికార్డుల్లో ఉన్న తప్పిదాలు సమస్యలు పరిష్కారం చేసి రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. భూ రికార్డులో అవకతవకలు జరగకుండా అధికారు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహా, శ్రీకాంత్ రెడ్డి, బాలరాజు, జగదీశ్వరప్ప, సురేశ్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సీతారాం పాల్గొన్నారు.

చేవెళ్ల రూరల్ : మున్సిపల్ పరిధి ఇబ్రహీంపల్లి, చేవెళ్ల మండల పరిధి కౌకుంట్ల గ్రామాల్లో తహసీల్దార్ కృష్ణయ్య, డీటీ రాజేంద్ర, శంకర్‌పల్లి మండల పరిధి హుస్సేన్‌పూర్ గ్రామం, మున్సిపల్ పరిధి ఫతేపూర్ వార్డులో తహసీల్దార్ సురేందర్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం నాలుగో రోజూ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి వాటిని పరిష్కరించి ప్రొసిడింగ్ అందజేశారు. మిగతా వాటిని పరిశీలించి త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు.

కేశంపేట : మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట, సంతాపూర్ గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తహసీల్దార్ ఆజంఅలీ తెలిపారు. ఎక్లాస్‌ఖాన్‌పేటలో 19, సంతాపూర్‌లో 6దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నివేదిత, రెవెన్యూ సిబ్బంది శివకుమార్ పాల్గొన్నారు.

ఆమనగల్లు : మండల పరిధిలోని చెన్నంపల్లి గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ లలిత ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. సదస్సులో ఐదు దరఖాస్తులను స్వీకరించినట్లు తహసీల్దార్ తెలిపారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తునట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌రూరల్ : ఫరూఖ్‌నగర మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు గ్రామస్తులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ పార్థసారథి సూచించారు. మండలంలోని కిషన్‌నగర్, గుండ్లకుంటలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు.

మొయినాబాద్ : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని తహసీల్దార్ గౌతంకుమార్ అన్నారు. మండల పరిధిలోని చిన్న మంగళారం గ్రామంలో తహసీల్దార్ గౌతంకుమార్, చాటల్‌గూడలో డిప్యూటీ తహసీల్దార్ వినోద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ పట్టాదారులు, తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

చెన్నంపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ లలిత

చేవెళ్ల రూరల్ : శంకర్‌పల్లి హుస్సేన్‌పూర్‌లో కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ సురేందర్, సిబ్బంది

శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గంగాధర్

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

కడ్తాల్, జూన్ 6: పండుగలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని సీఐ గంగాధర్ అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన, శాంతి కమిటీ సమావేశానికి నాయకులు, మత పెద్దలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బక్రీద్ పండుగను అందరూ కలిసిమెలిసి శాంతియుతంగా జరుపుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఆంజనేయులు, మహేశ్‌గౌడ్, ఇమామ్ జహీరుద్దీన్, అహ్మద్‌జానీ, జహాంగీర్‌అలీ, ఇర్షాద్, వాహబ్, లతీఫ్, బాబా, సిబ్బంది పాల్గొన్నారు.

కేశంపేటలో ఘనంగా తిరంగయాత్ర

కేశంపేట, జూన్ 6 : ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడాన్ని హర్షిస్తూ కేశంపేట మండల కేంద్రంలో శుక్రవారం తిరంగ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నేతలు, యువజన సంఘాల సభ్యులు త్రివర్ణ పతాకాన్ని చేతపట్టి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అల్వాల – కాకునూరు చౌరస్తా నుంచి ముఖ్యకూడలిలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి దేశ ఐక్యతకు సంబంధించిన నినాదాలు చేశారు. కార్యక్రమంలో శ్రీవర్ధన్‌రెడ్డి, రాధిక, రఘు రాంగౌడ్, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను పునఃప్రారంభానికి సిద్ధం చేయండి

కేశంపేట, జూన్ 6 : వేసవి సెలవులు పూర్తి కావస్తున్న తరుణంలో ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కేశంపేట ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలతోపాటు వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రదీప్, విద్యుత్ ఏఈ ఈశ్వర్ పాల్గొన్నారు.

పరిశ్రమ ఎదుట పాడి రైతు ఆందోళన

నందిగామ, జూన్ 6: మండల పరిధిలోని పెద్దకుంటతండా గ్రామానికి చెందిన పాడి రైతు కొర్ర శ్రీనుకు చెందిన ఆవు గ్రామ సమీపంలోని ఎమ్ఎస్ఎన్ పరిశ్రమ కాలుష్యంతో మృతి చెందిందని ఆరోపిస్తూ ఆవుతో పరిశ్రమ ఎదుట ఆందోళన చేపట్టారు. పరిశ్రమ కాలుష్యం వల్ల తరుచూ పశువులు మృతి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.70 వేలు విలువ చేసే ఆవు మృతి చెందిందని, పరిశ్రమ యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

చేవెళ్ల రూరల్, జూన్ 6 : లారీ బైక్‌ను ఢీ కొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్‌కు చెందిన వర్ధ్య హర్షవర్ధన్ (19) హైదరాబాద్ నుంచి శుక్రవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదే సమయంలో లారీతో వికారాబాద్ నుంచి చేవెళ్ల వైపు వస